بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ  نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ  وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 31.03.2017 (Telugu)**

**తమ కొరకు ఆశించేదే తమ మిత్రుని కొరకు ఆశించవలెనను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఆదేశమును మనము సదా గుర్తుంచుకోవలెను. తమ తప్పిదములు ఇతరులకు తెలియకూడదని ఆశించినప్పుడు ఇతరుల గురించి అలాంటి భావములే కలిగియుండాలి. సమాజములో శాంతికి ఇదొక అనివార్యమైన అద్భుతమైన సూత్రము**

**నాలుక రుచి కొరకు, ఆనంద వాతావరణమును ఏర్పాటు చేయుటకు ఇతరుల తప్పిదములను చర్చించుట ఘోరమైన పాపము. ప్రతి అహ్మదీ దీని నుండి దూరముండవలెను.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 31.03.2017 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

ప్రతి లోపము నుండి అన్ని విధాలా పవిత్రుడైన మానవుడు ప్రపంచములో లేడు. తప్పులను కప్పిపుచ్చే అల్లాహ్ తఆలా మన తప్పులను కప్పిపుచ్చుచున్నాడు. మానవుని తప్పులు, నిర్లక్ష్యములు ఇతరులకు తెలిపిసోయినచో ఎవరికి ముఖము కూడ చూపలేడు. లోపములను కప్పిపుచ్చే, పాపములను క్షమించే అల్లాహ్ తఆలా మనపై ఉపకారము చేయుచు మనకు ఇస్తిగ్ఫార్ నేర్పించెను. మీరు మీ తప్పులు, లోపముల నుండి దూరముండుటకు ప్రయత్నించుచు ఇస్తిగ్ఫార్ కూడ చేయుము. తద్వారా నేను మీ పాములను కూడ క్షమించెదను, మీ లోపములను బహిర్గతము చేయను. మీ దుఆలను ఆమోదించెదను. సాధారణంగా అల్లాహ్ తఆలా ప్రతి ఒక్కరి అనేక విషయాలను దాచిపెట్టును. కాని ఇస్తిగ్ఫార్ చేసేవారిని అల్లాహ్ కరుణ ప్రత్యేకంగా తమ రక్షణలో తీసుకొనును. ఘఫర్ అనగా దాచి పెట్టుట, కప్పిపుచ్చుట అని అర్థము. దాదాపు ఇదే అర్థము సతర్‌కు కూడ గలదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లనిరి. ఇస్లాం ఏ దేవున్ని ప్రవేశ పెట్టినదో, ముస్లిములు ఏ దేవున్ని నమ్మినారో అతడు పరమ కారుణ్యమూర్తి, కరుణామయుడు, దయాళువు, ఆర్తత్రాపరాయణుడు, క్షమాగుణప్రపూర్ణుడు. నిజమైన పశ్చత్తాపము చేయువాని పశ్చత్తాపమును అల్లాహ్ తఆలా ఆమోదించును. అతని పాపములను క్షమించును. ప్రపంచవాసులు ఒకరి పాపము, లోపమును విడిచిపెట్టినను అతన్ని అనుమాన, సందేహాహాస్పద చూపుతో చూడును. కాని అల్లాహ్ తఆలా ఎంతటి దయాళువు అనగా మానవుడు వేలాది తప్పులకు పాల్పడిన తరువాత కూడ సిగ్గుపడినచో క్షమించును. సందేశహరులు తప్ప అల్లాహ్ తఆలా వలె ఇంతగా క్షమించే మానవుడు ప్రపంచములో ఎవడు లేడు. అల్లాహ్ తఆలా తరువాత ప్రవక్తలు మాత్రమే ఇలా చేయగలరు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ తఆలా క్షమాగుణము ఎలాంటిదనగా అతడు మానవుని పాపములు, తప్పిదములను చూచినను తన ఈ లక్షణము వలన మానవుడు హద్దులు మీరనంత వరకు కప్పిపుచ్చుచుండును. కాని మానవుడు ఇతరుల తప్పిదమునుచూడకముందే అల్లరి చేయును. వారిట్లనిరి. అతని కరుణ, దయ ఎంతటి గొప్ప లక్షణమో గమనించుము. అల్లాహ్ తఆలా ప్రతీకారము తీర్చుకోదలచినచో అందరిని

నాశనము చేయును. ఆని అతని కరుణ, దయ చాలా విశాలమైనది. అతని కోపమును అది దాటిపోయెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ విషయమును అర్థము చేసుకున్నచో, మన సహచరులు, సోదరులు, తమ సంబంధీకుల విసయములలో అనుక్షణం వెంటాడుచు అన్వేషణలో యుండకుండా, వారి లోపములను వెతుకుచు యుండనిచో ప్రేమానురాగము, ఆప్యాయత గల శాంతియుత సమాజము ఏర్పడవచ్చును. కప్పిపుచ్చే బదులు ఇతరుల లోపములను బహిర్గతము చేయుటకు ప్రయత్నించేవారు మనలో చాలా మంది యున్నారు. కాని తమ గురించి ఎవరైనా మాట్లాడినచో లేదా ఫలానా వ్యక్తి నా గురించి ఇలా మాట్లాడినాడని తెలిసినచో కోపోద్రిక్తులై పోతారు. అతి కోపానికి గురై చంపుటకు లేదా చనిపోవుటకు సిద్ధమైపోతారు. తమ కొరకు ఆశించేదే తమ మిత్రుని కొరకు ఆశించవలెనను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఆదేశమును మనము సదా గుర్తుంచుకోవలెను. తమ తప్పిదములు ఇతరులకు తెలియకూడదని ఆశించినప్పుడు ఇతరుల గురించి అలాంటి భావములే కలిగియుండాలి. సమాజములో శాంతికి ఇదొక అనివార్యమైన అద్భుతమైన సూత్రము.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. లోపమును చూచి ఆయా లోపమును ప్రచారము చేసే బదులు ప్రతి ఒక్కరు ఇస్తిఘ్ఫార్ చేయవలెను. అల్లాహ్ తఆలా స్వయంభువు. మనలోని గల అనన్య లోపములు బహిర్గతము కావచ్చునని భయపడవలెను. సదుద్ధేశముతో ఇతరుల లోపములను మానవుడు కప్పిపుచ్చినచో అల్లాహ్ తఆలా శుభములను పొందువాడగును. అల్లాహ్ తఆలా ప్రతీకారము తీసుకోదలచినచో, లెక్కించదలచినచో సర్వమును నాశనము చేయునను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఈ విషయమును సదా ఎల్లప్పుడు గుర్తుంచుకోవలెను. కనుక చాలా భయంకరమైన సమయమిది. అనుక్షణం ఇస్తిఘ్ఫార్ చేయవలసిన అవసరమున్నది. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సందర్భమున ఇట్లనిరి. ఒకరు తన సోదరుడైన ముస్లిం ఏదేని లోపమును దాచినచో అల్లాహ్ తఆలా ప్రళయ దినమున అతని లోపమును దాచిపెట్టును, కప్పిపుచ్చును. తన ముస్లిం సోదరుని లోపములను బహిర్గతము చేయుచు, ప్రజలకు తెలుపుచు తిరుగుచున్న వ్యక్తి లోపమును, నగ్నత్వమును అల్లాహ్ తఆలా ఎలా బహిర్గతము చేయుననగా అతని కటుంబములోనే అతన్ని అవమానానికి గురి చేయును. ఇదెంతో హెచ్చరికతో కూడిన భయపడవలసిన స్థానము. అల్లాహ్ తఆలాశుభములను పొందుటకు ఎల్లప్పుడు ఇతరుల లోపమును చూచే బదులు తమ గురించి ఆలోచించవలెను. అప్పుడే మనము అల్లాహ్ తఆలా శుభమము, కరుణను పొందవచ్చును. మనము ఒకరి తప్పును బహిర్గతము చేయనంత రవకు ఎలా సవరించగలము. ఒకరి పాపము జమాఅత్ వ్యవస్థకు నష్టము కలిగించుటకు కారణమైనచో లేదా సమాజములో ఒక శ్రేణిని ఆవహించుకొని చెడగొట్టుచున్నచో సవరణ కొరకు నియమితులైన అమీర్ జమాఅత్ యున్నాడు, జమాఅత్‌లో సదర్ జమాఅత్ యున్నాడు సవరణ కొరకు వారికి తెలుపవలెను లేదా నాకు వ్రాయవలెనని సదా గుర్తుంచుకోగలరు. కాని ఒకరి తప్పిదమును చూచి ప్రచారము చేయుటను ఎట్టి పరిస్థితిలో అనుమతించరాదు. ఎందుకనగా ఇలా పాపములు అంతమయ్యే బదులు వ్యాపించును. దీని గురించి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఆదేశమును సదా గుర్తుంచుకోవలెను. నీవు ప్రజల బలహీనతల వెనుకపడినచో వారిని చెడగొట్టెదవు. సమాజములోని శాంతిని కూడ చెడగొట్టెదవు. ఇటువంటి బలహీనతలు వివిధ ప్రదేశములలో చర్చించబడినచో ఈ పాపములు గల వ్యక్తులు మొండితనానికి పాల్పడెదరు. ఆ మొండితనము వలన తమ వలె ఇతరులను కూడ తయారు చేయుటకు వారు సిద్ధమైతారు. తమ పరిధిని విస్తరించుటకు ప్రయత్నించుతారు. భయం సడలిపోవును. తద్వారా సవరించే అవకాశము కూడ లభించదు.

చాలా జాగ్రత్తగా, సహానుభూతి భావములతో సంస్కరణ పనులు చేయాలని నేను ప్రత్యేకంగా జమాఅత్ పనులు అప్పగించబడిన వారికి నేనిక్కడ చెప్పదలచితిని. నా బలహీనత ఫలానా పదవిదారుని వలన బహిర్గతమై, ప్రచారము చేయబడినది, ప్రజలకు తెలిసినదని ఏ వ్యక్తికి భావము కలుగకూడదు. ఇటువంటి భావము ఏర్పడినచో అతని ప్రతిస్పందన చాలా కఠినమగును. ఇటువంటి పదవిదారులను అల్లాహ్ తఆలా క్షమించుగాక! నా లక్షణములను అధికాధికముగా అలవర్చుకోగలరని నేను మీకు సేవ చేయుటకు అనుగ్రహించినందుకు నా క్షమాగుణమునకు విరుద్ధముగా వ్యాకులతలను. పీడనమును సృష్టించుటకు కారకులగుచున్నారు. అల్లాహ్ తఆలా క్షమాగుణమును ఎంతగా ఇష్టపడును. క్షమించేవానిని అల్లాహ్ తఆలా ఎంతగా అనుగ్రహించునో తెలుపుచు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సందర్భమున ఇట్లనిరి. ఒక ముస్లిం మరో ముస్లిం సోదరుడు. అతడు అతనిపై దౌర్జన్యము చేయడు. అతన్ని ఒంటరిగా విడిచిపెట్టడు. ఎవరైతే తన సోదరుని అవసరాలను పూర్తి చేయునో అల్లాహ్ తఆలా అతని అవసరాలను పూర్తి చేయును. ఒక ముస్లిం వ్యక్తి బాధను ఎవరైతే దూరము చేయుదురో అల్లాహ్ తఆలా ప్రళయ దినమున అతని బాధను తగ్గించును. ఒక ముస్లిం తప్పును దాచిపెట్టినచో అల్లాహ్ తఆలా ప్రళయ దినమున అతని తప్పును దాచిపెట్టును.

ఆ దయామయుని, కారుణ్యమూర్తి దయ, కరుణను పొందుటకు క్షమించుట, పాపములను దాచిపెట్టుట అనివార్యము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక సందర్భమున ఇట్లనిరి. అల్లాహ్ తఆలా గుణాలను అలవర్చుకొనుటయే మానవుని గొప్పతనము. అనగా అల్లాహ్ తఆలా గొప్ప గుణములను, లక్షణములను సాధ్యమైనంత వరకు అలవర్చుకోవలెను. తనను తాను అల్లాహ్ తఆలా ప్రకారము మార్చుకోవలెను. ఉదాహరణకు అల్లాహ్ తఆలా క్షమించును. కనుక మానవుడు కూడ క్షమించవలెను. అల్లాహ్ తఆలా కప్పిపుచ్చును. కనుక మానవుడు కూడ క్షమించవలెను. నాలుక రుచి కొరకు, ఆనంద వాతావరణమును ఏర్పాటు చేయుటకు ఇతరుల తప్పిదములను చర్చించుట ఘోరమైన పాపము. ప్రతి అహ్మదీ దీని నుండి దూరముండవలెను. ఒకరి బలహీనతను చూచినచో అతని నుండి ఆయా పాపము లేదా బలహీనత దూరమగుటకు అతని సంస్కరణకు కృషి చేయుటయే నిజమైన సహానుభూతి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. లోపము చూచినచో అతనికి రహస్యముగా ఉపదేశము చేయవలెను. మౌనముగా అతన్ని ప్రక్కకు తీసుకెళ్లి ఉపదేశము చేయవలెను. అంగీకరించనిచో అతని కొరకు దుఆ చేయవలెను. దుఆలో ఎంతో శక్తి గలదు. ఒకరి తప్పును వంద సార్లు చెప్పి ఒక్క సారి కూడ దుఆ చేయని వ్యక్తి పట్ల విచారము. నలుబది రోజులు ఒకరి కొరకు అతి దుఃఖముతో దుఆ చేసిన తరువాత చెప్పవచ్చును. లోపమును బలపరచాలని మా ఉద్ధేశము కాదు. కాని దానిని ప్రచారము చేయకూడదు, నిందలు మోపకూడదు. దానిని ప్రచారము చేయకుము. ప్రజలకు చెప్పకూడదు, అతను లేనప్పుడు చెప్పకూడదు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. పరస్పరం కరుణ, దయ, క్షమాగుణము లేనంత వరకు ఈ సంస్థ అభివృద్ధి చెందదు. మనము పరస్పరం ఒకరు మరొకరిని క్షమించేటట్లు వారు మనలను చూడదలచిరి. మరొక సందర్భమున వారిట్లనిరి. ఒక సోదరుని లోపమును చూచి అతని కొరకు మన జమఅత్ దుఆ చేయవలెను. దుఆ చేయకుండా దానిని ప్రచారము చేసి దూరము వరకు అందించినచో వారు పాపమునకు పాల్పడుచున్నారు. దూరము కాని లోపమేమున్నది. కనుక దుఆ ద్వారా ఇతర సోదరులకు సహాయము చేయవలెను. ఒకు యరొకరి లోపమునలు వెలికితీసే బదులు, క్షమించే బదులు మనమిలా పరస్పరం సహకరించుకొన్నచో, ఒకరం మరొకరి

కొరకు దుఆ చేసినచో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆశించిన విధముగా మనము నిజమైన జమాఅత్‌గా సిద్ధము కాగలము. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశముల మేరకు మని స్థితి ఇటులనే యుండవలెను. ఈ స్థితియే మన క్షమాపణ, అనుగ్రహ, దాచిపెట్టుటకు కారణమగును.

అల్లాహ్ తఆలా క్షమాపణలో వచ్చుటకు, అతని శుభములను పొందుటకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మనకొక దుఆ బోధించారు. దానిని మనము చేయుచుండవలెను. ఆ దుఆ ఇట్లు గలదు. ఓ అల్లాహ్! ఇహపరలోకములో నేను నీ క్షమాపణను యాచించుచున్నాను. సంరక్షకుడా! ధర్మము, ప్రపంచము, ధనము, కుటుంబము, గృహములో నేను నీ క్షమాపణను కోరుకుంటున్నాను. ఓ అల్లాహ్! నా లోపములను కప్పిపుచ్చుము. నాకు నా భయముల నుండి శాంతిని ప్రసాదించుము. ఓ అల్లాహ్! ముందు, వెనుక, కుడి, ఎడమ నీవు సవ్యముగా రక్షించుము. క్రింది నుండి వచ్చే బాధ నుండి రక్షణ పొందుటకు నేను నీ వైభవ శరణమును కోరుచున్నాను.

మనము ఈ దుఆ మన కొరకు చేసినప్పుడు ఇతరుల కొరకు కూడ మనము ఇలాంటి భావములే కలిగియుండవలెను. ఈ స్థితి ఏర్పడినప్పుడు అల్లాహ్ తఆలా దుఆలను కూడ ఆమోదించును. అల్లాహ్ తఆలా ప్రీతని మనము పొందువారమగుదుము గాక!

ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ ఇట్లనిరి. నమాజ్ తరువాత పాకిస్తాన్‌లోని జమాఅత్ నన్కానా సదర్ జమాఅత్ అయిన గౌ॥ మలిక్ సలీమ్ లతీఫ్ అడ్వొకేట్ గారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతును. వీరు మలిక్ ముహ్మద్ షఫీ గారి కుమారులు. 70 సం॥లు వారి వయసు యుండెను. 30 మార్చి 2017 తేదీన ఉదయం సుమారు 9 గం॥లకు తమ కుమారునితో కలిసి న్యాయస్థానమునకు వెళ్లుచుండగా మార్గమధ్యలో అహ్మదియ్యత్ శత్రువు అయిన ఒకరు కాల్చి షహీద్ చేసెను. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూఊన్.

హుజూరె అన్వర్ అమరుని సద్గుణములను ప్రస్తావించారు. అల్లాహ్ తఆలా అమరుని స్థాయిని పెంచుగాక! వారి సంతానము కూడ వారి అడుగుజాడలలో నడుచుగాక! సత్కార్యములలో ముందడుగు వేయుదురుగాక! అహ్మదియ్యత్ వ్యతిరేకులు, శత్రువులను అల్లాహ్ తఆలా త్వరగా శక్షించుగాక! (ఆమీన్)

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Hafiz Syed Rasool Niyaz, Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

.......................................................................

.......................................................................

.......................................................................